గల్పిక:

# అభివృద్ధిసూచనలు

## శ్రీమతి ఇ.సరస్వతీదేవి

ఆ చిన్న తాలూకాలో ఒక మట్టసమైన టౌనుహాలూ, ఒక టెన్నిస్ కోర్టూ, తాను వకీలుగా ప్రాక్టీసు మొదలుపెట్టిన తరువాత అధికప్రయత్నముతో ఏర్పరచాడు చంద్రశేఖరము. ఒక క్లబ్బూ, దానికిపాలకవర్గమూ, ఏకీభవించిన సభ్యత్వమూ చక్కగా అమరినాయి. దీనికి ఆదర్శగ్రామాన్ని నిర్మించినంత సంతోషముతో చంద్రశేఖరము సంతుష్టి చెందాడు. అక్కడి ప్రజల దృష్టిలో చంద్రశేఖరము గొప్పనిర్మాత, సంస్కారి అయినాడు.

ఒక నాడు ఉన్నట్టుండి - ఆ గ్రామములోకూడా కొంతమంది రచయితలనూ కవులనూ సృష్టించాలన్న ఆలోచన అతని మనసులో మెరపులా, మెరసినది. ఆసాయంత్రమే పెద్దలనూ క్లబ్బు సభ్యులనూ సమావేశపరచి తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. గ్రామపురోభివృద్ధికి రచనలెంతైనా అవసరమని ప్రోత్సహించాడు.

"ప్రారంభదశలో ఉన్న మన రచనలను ఏ పత్రిక అభిమానిస్తుందీ" అన్న శంక ఒక సభ్యుడికి కలిగి వెంటనే బయటికి అనేశాడు.

"అవును ఆమాటా నిజమే కాని ఏ పత్రికో మన రచనలను అభిమానించదని చిన్నబుచ్చుకో నవసరము లేకుండా ఈ గ్రామములో మనమే ఒక సమితి స్థాపించుకొని, ప్రతినెలా సమావేశాలు జరిగించుకుంటూ - ఎవరి రచనలను వాళ్లు ఆ సమావేశములో చదివేటట్లూ ఏడాది కొకసారి ఈ సభ్యులలో ఒకొక్కరి ఉత్తమ రచనను గ్రంథరూపములో అచ్చొత్తించే ఏర్పాటు సమితిపక్షాన చేయాలి. ప్రతిసభ్యుడూ అయిదు రూపాయల మాస చందాను ఇవ్వవలసి ఉంటుంది. ఈధనముతోనే అచ్చుఖర్చులను భరించవలసి ఉంటుంది. ఈ తీర్మానాలు నచ్చినవాళ్లు ఈ సమితిలో చేరవచ్చును," అని తన మనసుల్లో మెదులుతున్న అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు చంద్రశేఖరము.

ఇది చాలామందికి నచ్చింది. అప్పటికప్పుడే పదిహేనుమంది రుసుము చెల్లించి సభ్యులైనారు. ఆసమావేశములోనే సమితికి 'నవ్యకవితాసమితి' అని నామకరణము చేశారు. పేరు చాలా ముచ్చటగా కుదిరినదని అంతా సంబరపడ్డారు.

ఆ సమావేశము ఆగస్టు నాలుగవ తేదీన జరిగింది. తిరిగి సెప్టెంబరు నాలుగవ తేదీన నవ్యకవితాసమితి సభ్యులైన రామారావుగారి యిట్లో సమావేశమయేటట్లూ సమితి సభ్యులంతాతమతమ రచనలను ఆసమావేశములో వినిపించేటట్లు తీర్మానముచేసి- అందరూ తలా ఒక తమలపాకువిడెమూ తీసుకొని వెళ్లిపోయినారు.

ఈ విధముగా స్థాపితమయిన 'సమితి' నెల కొక సమావేశము జరిగించుకుంటూ, ఏడాది అయేసరికి ఆకవులు తమ రసవంతమైన రచనలను గ్రంథరూపములో అచ్చువేయించుకున్నారు. గ్రథాన్ని అందుకున్న ప్రతివారూ ఆసమితి చేసినసేవకు అబ్బురపడ్డారు.

ఆ రచయితలకు కవులకుమహోజ్వలమైన భవిష్యత్తు ఉన్నదని శుభాకాంక్షలను తెలిపినారు.

నాటినుండీ ఆకవులకు ఎక్కడికి వెళ్లినా నీరాజనాలూ, ఏ ప్రాంతాలకు వెళ్లినా ఆడంబర స్వాగతాలూ సన్మానాలూ- ఏ పత్రికలో చూచినా వాళ్ల పేరులూ ప్రతిష్ఠలూనూ.

గ్రామగ్రామములో వారికీర్తి దిశదిశలా ప్రాకిపోయినది.

సభ్యులు ఆ యశఃకాంతిలో దిగ్భ్రాంతి చెంది తబ్బిబ్బులు కాకుండా తలలు వంచుకొని తమప్రణాళిక ననుసరించి సాగిపోతున్నారు.

ఆ సమితి పక్షానఎందరెందరో ప్రఖ్యాత కవులూ కథకులూ ఆహ్వానింపబడి మన్ననలందుకున్నారు. సుప్రసిద్ధ రచయితలెందరో ఆదేశాలూ సందేశాలూ పంపారు.

ఈ మార్గాన మూడు సంవత్సరాలు నిండే. లోపల రెండుగొప్ప గ్రంథాలను అచ్చువేశారు. వారి యశశ్చంద్రికలు తారానాథుని సమీపించటానికి ఒక్క అంగుళమంతదూరమే ఎడమున్నది.

మామూలుగా ఒకనాటి సమావేశములో సభ్యులు తమ పద్యాలనూ రచలనూ చదవటము ప్రారంభించారు. వేణుగోపాలరావు తాను రచించినవి చదువుతున్నాడు. అతడు చదివేటప్పుడు ఎదురుగా కూర్చున్న రామారావు తనప్రక్కనున్న శేషగిరిరావు కాలిని గీరుతున్నట్లుగా అతడికి కనబడ్డది. మరి కొంతసేపటికి కన్ను గీటుతున్నట్లుగా తోచింది. ఎప్పటివలె ఉత్సాహముతో చదవలేక పోయినాడు.

కార్యక్రమము ముగియగానే ఎక్కడి వారక్కడికి వెళ్లిపోయినారూ.

త్రోవలో రామారావు తన ప్రక్కనున్న వాళ్లతో అంటున్నాడు. "తన తిక్కనంతా పద్యాలలోకి ఎక్కించి వ్రాస్తున్నాడు. ఆ చదవటమయినా వినసొంపుగా ఉన్నదేమో గమనించారు?"

"అది కాక, తన కవిత్వము ముందర 'అందరినీ దిగదుడుపు' అన్న 'అహం' కూడా బయలుదేరిందోయి మనవాడికి" అని మరొకరు జవాబిచ్చినారు.

ఈ మాటలను వాళ్లు అనుకొనేటప్పుడు నిజానికి అక్కడ ఎవరూ లేరు. గోడలకో బాటకో మరి దేనికో చెవులు ఉండి ఉండాలి - లేకపోతే ఆమాటలు సమితి సభ్యులందరికీ ఎట్లా తెలుస్తుందీ? అందులో వేణుగోపాలరావు చెవికి తాజావార్తగా ఎట్లా చేరుతుందీ?

ఇంతలో ఆ సభ్యులలో ఒకరింటికి కవి

సోదరులొకరు రావటము తటస్థించింది. మర్యాదకో - మరిదేనికో స్తోత్రసుధను ఆ సభ్యుడికి బాగా అందిచ్చారువాళ్లు. అది తాగినకైపులో ఆ సభ్యుడు 'వారు తగిన స్థానము కాదండీ యిది. ఇదండా చొప్ప దంటుదళము. పైగా అంతా కుత్సితమూ తల బిరుసుపతమూ కనబడుతుంది. మీరు దూరాన ఉండేవారుకనుక దూరపు కొండలు నునుపుగా కనబడుతున్నాయి. ఏదో ఒకసారి ప్రారంభించాము కనుక వదిలి పెట్టలేక చూస్తున్నాను-" అని అనటము తటస్థించినది.

ఈ వార్త తాజావార్తగా- నాసుపాము విషమువలె సభ్యుల తలలకు ఎక్కినది.

నాలుగవ పుస్తకము రాకముందే ఒకరి యింటిమీద కాకి మరొకరి యింటిమీద వాలలేదు. ఒకరి ఒంటిమీద వాలిన ఈగ కూడా మరొకరి ఒంటిమీద వాలలేదు.

చాటుగా తూర్పారపట్టటమూ, తెగ విమర్శించటమూ- ఎదుట కనపడగానే 'ఓహో!' అనటమూ ప్రారంభమయినది.

సభ్యులంతా ఒకరికి నీతిచెప్పేవారే అయినారు. అందరూ గురివెంద గింజల వలెనే ఉంటూ వచ్చారు.

సమితి స్థాపకుడైన చంద్రశేఖరము తనకూ, సూక్ష్మముగా ఆ వ్యాధి ఉన్నట్టు గ్రహించి, వైద్యుల సలహాలవల్ల నయము చేసుకొని, తిరిగి తల ఎత్తకుండాటానిక్కులు సేవిస్తూ, విటమినుమాత్రలను సేవిస్తూవచ్చాడు. సమితి సభ్యులలో ఒకరిని దేశములోగల సారస్వత సంఘాలనన్నిటినీ పరిశీలించి అభివృద్ధిమార్గాలను తెలుసుకొని పరిరమ్మని పంపినాడు.

ఇక్కడ సమితిస్థితి ఏరోజుకారోజుకు విషమించిపోతున్నది. కష్టపడి గడించిన పేరుప్రతిష్ఠలు సన్నగిల్లసాగినవి. తమ సభ్యుడు పర్యటన నుంచి ఎప్పుడు వస్తాడా అని ఎదురుతెన్నులు చూస్తున్నదా సమితి.

సమితి ఖర్చులమీద ఆ సభ్యుడు తాను ఏది వరకూ చూడని ప్రదేశాలనుచూచి ఆనందించి కావలసినంత ప్రపంచానుభవము సంపాదించాడు. తాను ఇంకా ఒకటిరెండు దూరప్రదేశాలకు వెళ్లదలచుకున్నందువలన తన అనుభవసందేశము పోస్టుద్వారా పంపాడు.

ఆజాబు సరిగా సభ్యులందరూ సమావేశ మయిన సందర్భములో చేరినది.

దేశప్రఖ్యాతి గాంచిన సమితుల యొక్క అభివృద్ధి మార్గాలనూ సూచనలనూ, క్షుణ్ణంగా తాను గ్రహించాడనీ- ఈమధ్య తమ సమితిలో కలిగిన మార్పులు అభివృద్ధి సూచకాలనీ తమ సమితికి మహోజ్వలమైన భవిష్యత్తు ఉన్నట్లుగా తన పర్యటనవలన తనకు తోచినదనీ- తాను త్వరలో రానున్నాననీ వ్రాశాడు.

ఈ ఉత్తరము చదువుకున్న ఆ సమితి సభ్యులు ఆనందపారావారములో మునిగి తేలుతూ - అందరూ తలా ఒక ఐస్క్రీము ప్లేటూ ఎక్కువ తీసుకున్నారు. ★

## ప్రేమించాను

(13-వ పేజీ తరువాయి)

రెచ్చిపోలేదు. నాయంతట నేనే ప్రేమించాను. నీవు ప్రేమిస్తున్నావని తెలిసికాదు. నీవు ప్రేమిస్తావన్న ఆశతో నుకాదు. ఇంకో విధంగా చేతకాలేదు. కొబట్టి ప్రేమించాను - ప్రేమిస్తున్నాను కూడా. ప్రేమించకుండా ఉండలేనుకూడా నేమో? నన్ను క్షమించవూ?......"

మిమ్మల నిలా ఆశగొల్పి మీ హృదయాన్ని నొప్పించానేమో అన్న బాధ నన్ను విడిచిపెట్టదు."

"ఆ విషయంలో నీ వేమాత్రం సందేహపడనక్కరలేదు. ఒకరిపై తప్పు తోసేంత నీచుని కాను. నీ స్వతంత్ర ప్రవర్తనను స్నేహాన్ని నేనేమీ అపార్థం చేసుకోలేదు. అంత అనాగరికుడనూ కాను."

"ఏమో...." దీర్ఘనిశ్వాసం ఆమె శరీరాన్నంతటినీ కుంగదీసింది.

"నీ వేమీ కించపడకు. విచారించవలసిందిందులో ఏమీ లేదు. నీవు ప్రేమించక పోయినంతమాత్రంతో మన స్నేహం చెడిపోదు. మనం మిత్రుల మయ్యాము. మిత్రులంగా ఉన్నాము. ఇక ఎన్నటికీ మిత్రులంగా ఉంటాము."

"ఎవరికి తెలుసు - ఈ ప్రేమకలాపాలతో ఎన్ని ప్రాణస్నేహితాలు పాడవడం లేదు? ఈ స్నేహం అలా అయితే...... నా గతి......"

"ఆ అనుమానం లేదు. మనస్నేహానికీ దీనికీ సంబంధం లేదు. మనం ఆప్తమిత్రులమే..." అని హృదయపూర్వకంగా వాగ్దానం చేశాను. అది వట్టి శుష్క ప్రియం కాదని నా గొంతుకే చెబుతున్నది. ఆమెమనసు చెబుతున్నది. ఇక ఏమీ అనలేదు.

కాని తిర్వాత విడిపోతున్నప్పుడామె ముఖంలో విషాదచ్ఛాయలు తొలకరించినవి. నడుం వంగిపోయింది. తా నేదో మహాపరాధం చేసినట్టుగా భావిస్తున్నదనుకుంటాను. మరొకసారి క్షమిస్తారుకదూ అన్నట్టుగా అతిదీనంగా నా కళ్లలోకి చూచి వెళ్లిపోయింది.

నా వాగ్దానాన్ని కసర్వదా పరిపాలించా లనుకున్నాను. ఎంతసౌమనస్యంతో ఆమె నా మాటలను గ్రహించింది అప్పుడు తెలుసు-నే నన్నమాట నిర్వర్తించే నిజాయితీ కలవాడనని తన్నర్థం చేసుకోగలనని చేసుకున్నానని కూడ ఆమె నమ్మకం. ఆమె విశ్వాసాన్ని, నా వాగ్దానాన్ని నిలబెట్టుకునేందుకై ప్రాణార్పణకైనా సిద్ధపడి ఈ క్షణందాకా బతుకునీడ్చుకొని వస్తున్నాను. ★


**రు. 100 బహుమానం**

(గవర్నమెంటు రిజిష్టర్డు)

తెల్లవెంట్రుకలను అంత మొందించండి రంగులు వాడకండి. మా ఆయుర్వేద సువాసన "సెంట్రల్ మోహిని ఆయిల్" 60 ఏళ్లదాకా నల్లగా ఉంచును. ఇది మీ దృష్టిని వృద్ధిపరచి తల నొప్పిని కుదుర్చుతుంది. కొన్ని వెంట్రుకలు తెల్లబడితే రూ. 2-8-0 తో ఒక సీసా (మూడు ఒకసారి 6-8-0) కొనండి. హెచ్చుగ తెల్లబడితే 3-8-0 (మూడు ఒకసారి 9-0-0.) తలంతా తెల్లబడితే రు. 5-0-0 (మూడు ఒకసారి రు. 12) కొనండి. ఇది అబద్ధమని ఋజువుచేసిన వారికి రు. 100 బహుమానం. పూర్తి విశ్వాసానికి అణాన్నర స్టాంపు పంపి గ్యారంటీ తీసుకొనండి.

**Bharat Kalyan Aushadhalaya.**
**Post Bag No 6725, Calcutta. (A P)**


మేజిస్ట్రేటు : నువ్వు కర్రవిరిగేదాకా వాదిని కొట్టావని ఈ సాక్షి చెబుతున్నాడు. నువ్వేం చెప్పుకుంటావు?"

ప్రతివాది: "కర్ర విరగగొట్టాలనే ఉద్దేశం నాకేమాత్రం లేదండి"